క్లుప్తంగా

చదరంగ పోటీల్లో దేవి దేదీప్యశ్రీ ప్రతిభ



దేదీప్యశ్రీతో హెచ్ఎం సుబ్బలక్ష్మి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విశాఖలో ఈ నెల 28న జరిగిన రాష్ట్ర స్థాయి అండర్–12 చదరంగ పోటీలో నగరానికి చెందిన దేవి దేదీప్యశ్రీ బంగారు పతకం సాధించింది. తద్వారా వచ్చే నెల 6 నుంచి 10వ తేదీ వరకూ బీహార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కాకినాడ సాలిపేట ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న దేదీప్యశ్రీ 2021 నుంచి చదరంగంలో శిక్షణ పొందుతూ, ప్రస్తుతం విశాఖలో ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటోంది. పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో దేదీప్యశ్రీని ప్రిన్సిపాల్ సుబ్బలక్ష్మి, వ్యాయామోపాధ్యాయురాలు కుమారి అభినందించారు.

తిమ్మాపురం ఎస్సైగా రవీంద్రబాబు



రవీంద్రబాబును అభినందిస్తున్న కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని తిమ్మాపురం పోలీసు స్టేషన్ ఎస్సైగా ఎంవీవీ రవీంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ వన్ టౌన్ పోలీసు స్టేషన్ నుంచి ఈయన బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పని చేసిన ఎస్సై షరీఫ్ వన్ టౌన్ ఎస్సైగా వెళ్లారు. కొత్తగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రవంద్రబాబుకు రైటర్ ఆలీషా, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం రమణయ్యపేట వైద్యనగర్‌లోని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయనను నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. తిమ్మాపురం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించినట్టు తెలియజేయడంతో అభినందనలు తెలియజేశారు. మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్, వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు మోకా కృష్ణంరాజు, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టరు కరీం బాషా, సుబ్బారావు, ఆదినారాయణ, సత్తి చిన్నారి పాల్గొన్నారు.

పరిశోధనలకు ప్రోత్సాహం అభినందనీయం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే కాకినాడ కళాశాలలో విద్యార్థులకు పరిశోధనలు ప్రొత్సహించేలా వాతావరణం ఉండటం సంతోషమని ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి పేర్కొన్నారు. వర్సిటీలో ఉన్న జంగిల్ బుక్ ఓపెన్ క్లాస్‌రూంలో ఐఎస్‌టీ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అమలు చేస్తున్న కార్యక్రమాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రానికి, కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. ఉపాధి, పరిశోధన, ఇంటర్న్‌షిప్, వ్యవస్థాపకత తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విదేశీ విద్య కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. ఆన్‌లైన్ వీడియో ద్వారా విద్యార్థులు తమకు తెలియని అంశాలను నేర్చుకునేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. వర్సిటీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ ఉన్నత విద్యామండలి సూచనల మేరకు జాతీయ నూతన విద్యావిధానంలో భాగంగా యూనివర్సిటీలో ఆన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్), ఆన్‌లైన్ లెర్నింగ్ (ఓఎల్) కోర్సులు ప్రవేశపెట్టామన్నారు. ఓడీఎల్‌లో భాగంగా ఎంబీఏ, ఏఐఎంఎల్ కోర్సులు ప్రవేశపెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు కేవీఎస్‌జీ మురళీకృష్ణ, ఐఎస్‌టీ డైరెక్టర్ డాక్టర్ ఎ.గోపాలకృష్ణ, ఇంక్యుబేషన్ ప్రత్యేక అధికారి మాలోతు రమేష్, డీఏపీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

హుండీల ఆదాయం రూ.89,490

సామర్లకోట: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణస్వామి ఆలయంలో హుండీల ద్వారా రూ.89,490 ఆదాయం వచ్చినట్టు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆలయంలో హుండీలను లెక్కించారు. సుమారు ఆరు నెలల తరువాత హుండీల లెక్కించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మీ ప్రయాణం భద్రం

- రైల్వే భద్రతలో కీలకంగా జీఆర్‌పీ
- విధులకు అదనంగా.. ఆదర్శవంతంగా

కేసుల గణాంకాలివీ...

నేరాలు	2020లో	2021లో	2022లో	2023లో
మరణాలు	18	12	7	15
చోరీలు	2	2	4	6
రికవరీ శాతం	50	100	100	కొనసాగుతున్నాయి

కాకినాడ క్రైం: కాకినాడ రైల్వే పోలీస్ ప్రయాణికుల భద్రతకు పెద్ద పీట వేస్తోంది. విధి నిర్వహణతో పాటు ప్రయాణికుల భద్రత దృష్ట్యా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు ఇక్కడి అధికారులు, సిబ్బంది. సాధారణంగా ఇక్కడ నమోదయ్యే కేసుల పరిష్కారం అంత సులభం కాదు. అయినా పరిష్కారం దిశగా ప్రతి కేసును నడిపిస్తూ ఉత్తమ ఫలితాలు రాబడుతున్నారు. ఎక్కడో పొరుగు జిల్లాలోనో లేదా రాష్ట్రంలోనో ప్రయాణం మొదలు పెట్టిన ఓ ప్రయాణికుడు తన వస్తువులు చోరీకి గురయ్యాయని చివరి హాల్ట్ అయిన కాకినాడ జీఆర్‌పీ పోలీసులను ఆశ్రయిస్తాడు. ప్రయాణికులు కోల్పోయిన విలువైన వస్తువులను తిరిగి రికవరీ చేసి పెట్టడంలో ఇక్కడి బృందం క్రియాశీలకంగా వ్యవహరిస్తూ విధి నిర్వహణపై వీరు చూపే చొరవ నిజంగా ఆదర్శవంతం. గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాలపై మృతి చెందితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం మృతదేహాన్ని భద్రపరిచి మరీ కుటుంబీకులకు అప్పగిస్తారు.

ఆర్‌పీ ఓపీ..

కాకినాడ గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఓ అవుట్ పోస్టు కాగా ప్రధాన స్టేషన్ సామర్లకోటతో అనుసంధానమై ఉంటుంది. కాకినాడ ఆర్‌పీ ఓపీ (రైల్వే పోలీస్ అవుట్ పోస్టు) అధికారిగా ఎస్‌ఐ రవి కుమార్ కొనసాగుతుండగా ఐదుగురు సభ్యుల బృందంతో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు ముగ్గురు కానిస్టేబుళ్లు ఉన్నారు. ఆ ముగ్గురిలో ఇద్దరు మహిళా సిబ్బంది పనిచేస్తున్నారు. రైలు లోపల, ప్లాట్ ఫాంపై ప్రయాణికుల భద్రత జీఆర్‌పీ లక్ష్యం.

కాకినాడ యువతులకు రక్షణగా..

కొన్ని నెలల క్రితం టౌన్ స్టేషన్ నుంచి 5 గురు యువతులు పరీక్ష రాసేందుకు బెంగళూరు వెళ్లారు. మార్గ మధ్యలో దాదాపు రాష్ట్ర సరిహద్దులు దాటి పోతున్న వేళ బిహార్ బృందానికి చిక్కారు. వారు అసభ్యంగా ప్రవర్తించగా విద్యార్థుల్లో ఒకరు తండ్రికి ఫోన్ చేశారు. ఆయన జీఆర్‌పీ ఎస్‌ఐ రవికుమార్‌కు ఫిర్యాదు చేయగా అర్ధగంటలో ఆకతాయిలను అక్కడి పోలీసులు రైలు దింపేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంలో రవికుమార్ సహా కాకినాడ జీఆర్‌పీ బృందానికి ఎస్పీ ప్రశంసలు దక్కాయి.

విద్యార్థులకు సన్మార్గం బోధిస్తూ..

విధి నిర్వహణతో పాటు ఇక్కడి జీఆర్‌పీ సామాజిక బాధ్యతను అందిపుచ్చుకుంది. పలు పాఠశాల, కళాశాలల విద్యార్థులకు రైలు ప్రయాణాలకు సంబంధించి భద్రత అంశాలు, అనుబంధ చట్టాలు, నేరాలు, వాటి నియంత్రణపై అవగాహన కలిపిస్తున్నారు. పలు నిరసనల్లో రైళ్లపై దాడులు సాధారణమవుతున్న ఉదంతాల నేపథ్యంలో, అందులో విద్యార్థులు పాల్గొంటున్న కారణంగా వీరి భవితకు జీఆర్‌పీ బృందం చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడనున్నాయి.



విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న రైల్వే పోలీసులు

ప్రయాణికుల బాధ్యతలు గుర్తు చేస్తూ..

రైలు ప్రయాణం కోసం స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు రైలు వచ్చే సమయంలోపు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో రైలు లోపల ఉండే ఆర్‌పీఎఫ్ సిబ్బంది సూచనకు అనుగుణంగా వ్యవహరించాలని చెబుతున్నారు. అలాగే అత్యవసర వేళల్లో చైన్ లాగి రక్షణ పొందే విధానాలపై అవగాహన కల్పించారు. ఫుట్‌పాత్ ప్రయాణం వల్ల కలిగే అనర్థాలు, చట్టపరమైన చర్యలను ప్రయాణికులకు బోధించారు. తోటి ప్రయాణికులు, రైలు సిబ్బందిని ఎటువంటి ఇబ్బందికి గురి చేయకుండా ప్రయాణం కొనసాగించాలని సూచించారు.

ముమ్మర తనిఖీలు..

మత్తు పదార్థాల తరలింపు సహా చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్వహణకు స్వార్థపూరిత శక్తులు రైళ్లు, రైల్వే స్టేషన్లు వాటి పరిసరాలను కేంద్రంగా ఎంచుకుంటున్నారు. అటువంటి వారి భరతం పడుతున్నారు ఇక్కడి జీఆర్‌పీ సిబ్బంది. కాకినాడలో ఉన్న రెండు రైల్వే స్టేషన్ల భద్రతను ఈ బృందమే పర్యవేక్షిస్తోంది. టౌన్, పోర్టు స్టేషన్లలో పోలీస్ జాగిలాలతో తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనిస్తున్నారు. స్టేషన్ పరిధిని పూర్తిగా సీసీ కెమేరాల నిఘాలోకి తీసుకుని నిరంతరాయంగా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ఈ తనిఖీలతో భాగంగా పలుమార్లు గంజాయి తరలింపును అడ్డుకున్నారు. మత్తు నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు.

ప్రయాణికుల భద్రతే లక్ష్యం



ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా కాకినాడ జీఆర్‌పీ విధులు నిర్వర్తిస్తోంది. భద్రతతో పాటు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రైలు ప్రయాణ భద్రత ప్రాధాన్యాన్ని ప్రయాణికులు, సామాన్య ప్రజలకు తెలియజేస్తున్నాం. ఎన్నో సందర్భాల్లో విలువైన వస్తువులు కోల్పోయిన ప్రయాణికులు మా ప్రయత్నంతో తిరిగిపొంది ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తారు. రికవరీ కేసుల్లో ఎంతో శ్రమించి సత్ఫలితాలు రాబడుతున్నాం. కాకినాడ లైన్స్ ఇన్‌స్పెక్టర్ గౌస్ బేగ్ సహా ఉన్నతాధికారుల సహకారంతో ఇది సాధ్యమైంది.

– నందికి రవికుమార్, ఎస్ఐ, జీఆర్‌పీ



పోలీస్ జాగిలాలతో పార్శిళ్ల తనిఖీలు



ఖరీదైన కెమేరాను రికవరీ చేసి ప్రయాణికుడికి అప్పగిస్తున్న జీఆర్‌పీ సిబ్బంది



టౌన్ రైల్వే స్టేషన్ భద్రతను సీసీ కెమేరాల్లో పర్యవేక్షిస్తూ...

మహిళా సంక్షేమానికి పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



జ్యూయలరీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ద్వారంపూడి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- నగరంలో వైఎస్సార్ ఆసరా పంపిణీ

కాకినాడ: మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సూర్యనారాయణపురం, ఆనందభారతి గ్రౌండ్స్‌లో వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ జరిగింది. నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా మెగా చెక్‌ను ఎమ్మెల్యే ద్వారంపూడి విడుదల చేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించాలనే ఆకాంక్షతో సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలకు మహిళలనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ, అమ్మ ఒడి, చేయూత సహా ఎన్నో పథకాల ద్వారా మహిళలకు ఆర్థికంగా స్థిరపడేందుకు అండగా నిలుస్తున్నారన్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయకపోవడంతో ఇబ్బంది పడ్డ మహిళల కోసం సీఎం వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రకటించి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో పథకాన్ని కచ్చితంగా అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, పలువురు మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, ఆర్‌పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి మెప్మా తోడ్పాటు

స్వయం ఉపాధి పథకాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేలా డ్వాక్రా సంఘాలకు మెప్మా అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక సూర్యనారాయణపురంలో మెప్మా తోడ్పాటుతో ఆదర్శ టౌన్ లెవెల్ ఫెడరేషన్ సభ్యురాలు వరలక్ష్మి ఏర్పాటు చేసి ఆర్టిఫిషియల్ జ్యూయలరీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి మంగళవారం ప్రారంభించారు. రూ.90 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రానికి మెప్మా ఆర్థిక తోడ్పాటు అందించింది. సులభ వాయిదాలతో తక్కువ వడ్డీతో తిరిగి చెల్లించుకునే విధానంపై ఈ రుణం మంజూరైంది. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుటుంబపోషణలో భాగస్వాములయ్యేందుకు ఇటువంటి పథకాలు తోడ్పడతాయన్నారు. ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రారంభించిన వ్యాపారం మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలకు త్వరలో రిజిస్ట్రేషన్లు

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరైన ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు పూర్తిస్థాయి హక్కు కల్పించేందుకు ఆయా స్థలాలకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేయనుందని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులు, ఉద్యోగులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల వారీగా ఇళ్ల స్థల లబ్ధిదారులందరినీ గుర్తించి రిజిస్ట్రేషన్లు చేయించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయా లబ్ధిదారుల ఫొటో, ఆధార్, ఇంటి పట్టా ఆధారంగా ఎటువంటి ఖర్చు లేకుండా ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు, ఇతర మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ప్రక్రియపై దృష్టి సారించాలని కమిషనర్ ఆదేశించారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 30 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, వీరందరికీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగించే అంశంపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రైతు, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కన్నబాబు
- రూ 3.07 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



వంతెన ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: రైతులు, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. అరట్లకట్టలో మంగళవారం కొవ్వూరు కెనాల్‌పై రూ 1.1 కోట్లతో నిర్మించిన వంతెనకు ఆయన ప్రారంభోత్సవం చేసి, సర్పంచ్ గోపి సత్యవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయం లాభసాటిగా చేసేందుకు అనేక పథకాలు అమలుచేయడమే కాకుండా, తుపాన్ల వంటి ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టపోయిన రైతులకు ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలను అదే పంటకాలంలో అందజేసి ఆదుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అరట్లకట్ట గ్రామంలో 400 పింఛన్లు మంజూరు చేయగా, వెయ్యి మందికి పింఛన్లు ఇస్తున్నామన్నారు. సీఎం జగన్ పాలనలో మంచి జరిగిందనుకుంటే వచ్చే ఎన్నికల్లో తనను మరొకసారి గెలిపించి తద్వారా జగనన్నను మళ్లీ సీఎంను చేయాలని ఎమ్మెల్యే కన్నబాబు కోరారు. ఈ సందర్భంగా గ్రామంలో వంతెన నిర్మాణంతో పాటు రూ.2.54 కోట్లతో పూర్తిచేసిన నాడు–నేడులో అదనపు తరగతి గదులకు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. రూ.23 లక్షలతో ఎస్సీ వీధిలో నిర్మించే సీసీ రోడ్డుకు ఆయన భూమిపూజ చేశారు. తర్వాత గొడ్డటిపాలెంలో రూ.2.5 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం వద్ద విశ్రాంతి షెడ్‌ను ప్రారంభించారు. తర్వాత కొరిపల్లిలో పర్యటించి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ కోసం రూ.32 లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంక్, మంచి నీటి పైపులైన్‌కు ప్రారంభోత్సవం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, గ్రామకమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, సర్పంచ్‌లు వాసంశెట్టి శ్రీనుబాబు, పలివెల నాగేశ్వరరావు, రొక్కాల గణేష్, సాదే ఆశాజ్యోతి ఎంపీటీసీలు సీహెచ్ కామేశ్వరి, దేవిశెట్టి సూర్యప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, కొత్త రవి, తిబిరిశెట్టి గజేంద్రుడు, కోలా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చనిపోయిన వారి ఓట్లు తొలగించండి

- ఈఆర్వో, కమిషనర్ నాగనరసింహారావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



కాకినాడ: ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ–2024లో భాగంగా చనిపోయిన వారి ఓట్లను ఓటర్లను జాబితా నుంచి తొలగించే విషయంలో రాజకీయ పార్టీలు తమవంతు సహకారం అందించాలని నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ నాగ నరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఓటర్ల తుది జాబితా అనంతర చర్యలు, ప్రగతిపై ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుది జాబితాలో ఉన్న చనిపోయిన ఓటర్ల పేర్లను తొలగించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆయా పేర్లను తొలగించాలంటే మృతుల మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సి ఉంటుందని, అయితే కొంతమంది కుటుంబ సభ్యులు వీటిని ఇచ్చేందుకు సహకరించడం లేదన్నారు. డెత్ సర్టిఫికెట్ అందుబాటులో ఉన్నప్పుడే మరణాన్ని ధ్రువీకరించుకుని ఓటును తొలగించే అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా తమ వంతు సహకారాన్ని అందించి ఓటర్లను, ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఈఆర్వోలు దొర, మురళీకృష్ణ, సీతాపతిరావు, నాగశాస్త్రులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ), గాంధీరాజు (కాంగ్రెస్), ఇతర అధికారులు ఉన్నారు.

ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధన ఉత్సవం



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు, విద్యార్థినులు

కాకినాడ రూరల్: సర్పవరంలోని భవానీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయం వాగ్గేయకార మండపంలో త్యాగరాజస్వామి ఆరాధనా ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సద్గురు సంగీత విద్యాలయం సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో ఉదయం పల్లకి సేవ, అష్టోత్తర పూజ నిర్వహించారు. అనంతరం త్యాగరాజ స్వామి అనే అంశంపై ఆకొండి శ్రీనివాస రాజారావు ప్రవచనంతో ఆకట్టుకున్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక కళాకారులు, సంగీత విద్యార్థినులతో పంచరత్న కీర్తనల గానంతో అలరించారు. సంగీత విద్వాంసులు చెలుకూరి సుబ్బలక్ష్మి, ప్రభల రాజేశ్వరి, వారణాసి విజయలక్ష్మి, వారణాసి వాణి, కేసరాజు శారదాదేవి తదితరులు త్యాగరాజ కృతులు ఆలపించారు. కార్యక్రమంలో మూర్తి, నరసింహమూర్తి, పవన్‌కుమార్, సత్యనారాయణ, పరశురామ్, వక్కలంక రామకృష్ణ, వెంకట్రావు, కృష్ణంరాజు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

నిజాయితీతో జీవితంలో ఉన్నతి



విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తున్న సీ పోర్ట్సు సీఈఓ మురళీధర్



కరప ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

బోట్‌క్లబ్: నిజాయతీని అలవర్చుకుంటే జీవితంలో పైకి వస్తారని కాకినాడ సీ పోర్ట్సు సీఈఓ మురళీధర్ విద్యార్థులకు సూచించారు. మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌లో మహాత్ముని విగ్రహానికి మంగళవారం ఘనంగా నివాళులు అర్పించారు. ప్రతి విద్యార్థి నిత్యం తాను నిజాయితీగా చదువుతున్నానా లేదా అని తనని తాను ప్రశ్నించుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. సత్యా స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ మాట్లాడుతూ మిత్రులకు, పరిచయస్తులకు తేడా వివరించి ఉన్నతమైన మిత్రులను సంపాదించుకోవడంలో వ్యక్తి ఉన్నతి ఉంటుందన్నారు. గాంధీభవన్ కార్యదర్శి వక్కలంక రామకృష్ణ మాట్లాడుతూ త్యాగానికి విలువ ఇవ్వాలంటే మనం గాంధీ ఆదర్శాలను అవలంబించాలన్నారు. ప్రజా విద్యాలయం విద్యార్థులు దేశభక్తి గీతాలు, గాంధీకి ఇష్టమైన గీతాలను ఆలపించారు. గాంధీభవన్ నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మురళీధర్, గాంధీభవన్ గౌరవాధ్యక్షుడు మెర్ల వీరయ్య చౌదరి బహుమతి ప్రదానం చేశారు. సమావేశంలో గాంధీ అధ్యయన కేంద్రం ఇన్‌చార్జి ప్రొఫెసర్ దోశగిరి రావు, ఉపాధ్యక్షులు విశ్వేశ్వరరావు, డాక్టర్ డీవీవీ సత్యనారాయణ, ట్రెజరర్ వాసా సత్యనారాయణ, ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్ డాక్టర్ ఎంవీ భరతలక్ష్మి, అల్లూరి సురేంద్ర, పాలెపు రవి పాల్గొన్నారు.

కరపలో..

కరప: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. గురజనాపల్లి హైస్కూలులో హెచ్ఎం ఎ.సాయిమోహన్ ఉపాధ్యాయులతో కలసి గాంధీజీ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పలుగ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు, పాఠశాలల్లో హెచ్ఎంలు గాంధీమహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓ కె.అప్పారావు, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, చింతా నాగలక్ష్మి, అడబాల సత్య, కొత్త నాగలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, ఏఓ గుత్తుల భీమశంకరరావు, జీవీ చినరాయుడు, టి.సురేష్, వీవీఎన్ వీరేష్, ఏపీఓ ఈవీ రమణ, సాదే లోహిదాస్, వనుం భాస్కర్ నివాళులర్పించారు.

జాతిపితకు ఘన నివాళి

బోట్‌క్లబ్: స్థానిక గాంధీనగర్ పార్క్‌లో కాకినాడ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మహాత్మ గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఐడీఏ అధ్యక్షుడు నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గాంధీజీ జ్ఞాపకార్థం జనవరి 30న అమరవీరుల దినోత్సవం షాహిద్ దివస్‌గా పాటిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఐడీఏ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి

బాలాజీచెరువు: అలయన్స్ క్లబ్ ఆఫ్ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మంగళవారం జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి నిర్వహించారు. క్లబ్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ చప్పిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గాంధీనగర్ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి నివాళులర్పించారు. గాంధీజీ సేవలు విద్యార్థులకు వివరించి వారికి బిస్కట్లు పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి పెంకే గోవిందరాజు, వరప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.